క్లుప్తంగా

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్ : సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శకుంతల హెచ్చరించారు. గురువారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సి.బెళగల్ – 2 సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ఇప్పటికైనా మానుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పీఎస్ కృష్ణప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఆలయ భూముల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ఓర్వకల్లు:మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో ఆలయ భూముల ఆదాయం పెరిగింది. గురువారం చెన్నకేశవ, ఆంజనేయస్వాముల దేవాలయాలకు చెందిన 192 ఎకరాల మాన్యానికి వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో రైతులు పోటాపోటీగా వేలం పాడి రూ.22,94,000 కౌలుకు దక్కించుకున్నారు. ఇదే భూములు గతేడాది రూ.18,05,000 పోగా, ఈ ఏడాది ఏకంగా రూ.4,89,000 అదనపు ఆదాయం లభించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, ఈఓలు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షన సర్వసభ్య నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శకుంతల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశానికి రావాలని సూచించారు.

విజయవంతంగా అడల్ట్ వ్యాక్సినేషన్



పాణ్యంలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పాణ్యం: 60ఏళ్లు పైబడిన వారికి దీర్ఘకాలిక వ్యాధుల సోకకుండా ఉండేందుకు ప్రభుత్వం అడల్ట్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్, ఎంపీహెచ్ ఈఓ సబ్బారెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ 60ఏళ్లు పైబడిన వారికి షుగర్, టీబీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా బీసీజీ టీకా వేస్తున్నామన్నారు. మండలంలో 390 మందికి వాక్సినేషన్ వేసినట్లు తెలిపారు. ఆయా గ్రామ సచివాలయ పరిధిలో ముందస్తుగా గుర్తించిన వారికి ఈ టీకా వేసినట్లు చెప్పారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని పెట్రోల్ బంకులను గురువారం విజిలెన్స్ అధికారి జిలానీబాషా తనిఖీ చేశారు. బంకుల్లో పంపులను, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా బంకులను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పెట్రోల్ బంకులను తనిఖీ చేస్తామన్నారు. పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో కొలతల్లో అవతవలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి నుంచి ఫిర్యాదులు వస్తే పరిశీలించి బంకులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చర్చిలో చోరీ

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఉన్న ఇంటింటి సువార్త ప్రార్థనా మందిరంలో చోరీ జరిగినట్లు సంఘపెద్దలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చర్చిలో ఉన్న సుమారు 11 వేల విలువ గల సామగ్రి, ఎలక్ట్రాక్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించరాని తెలిపారు.

అధిక రక్తపోటు.. ఆరోగ్యానికి చేటు

- పెరుగుతున్న రక్తపోటు బాధితులు
- గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం
- పట్టణ ప్రాంతాల్లో 30 శాతం మంది బాధితులు
- నియంత్రణ లేని ఆహారం, స్థూలకాయం, మానసిక ఒత్తిళ్లే కారణం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు
- నేడు అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం

గంటల కొద్దీ కార్యాలయాల్లో కూర్చుని పనిచేయడం, స్థూలకాయాన్ని పెంచుకోవడం, ఫాస్ట్‌పుడ్, జంక్‌పుడ్ అధికంగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వంటివి మనిషిని అధిక రక్తపోటుకు గురిచేస్తున్నాయి. గతంలో వందలో ఒకరిద్దరిలో మాత్రమే అధిక రక్తపోటు ఉండేది. ఇప్పుడు ప్రతి పది మందిలో ఇద్దరు, ముగ్గురిలో ఈ వ్యాధి కనిపిస్తోంది. బీపీ వల్ల వచ్చే వ్యాధులు మరింత కృంగదీసి చెట్టంత మనిషిని కబలిస్తున్నాయి. ఈనెల 17న అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(హాస్పిటల్)

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. మరో 12 ఆరోగ్య కేంద్రాలు అదనంగా వస్తున్నాయి. వీటితో పాటు 28 అర్బన్‌హెల్త్ సెంటర్లు, 400లకు పైగా సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆశాలు, ఏఎన్ఎంలు కలిసి కొంత కాలంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 28,77,893 మందికి పరీక్షలు నిర్వహించగా 7,69,798 మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు నిర్ధారించారు. ఇక ఇటీవల నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 8,93,326 మందికి పరీక్షలు నిర్వహించగా 1,71,970 మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు తేలింది. ఈ లెక్కన గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం, పట్టణ ప్రాంతాల్లో 30 శాతం మంది రక్తపోటుకు గురైనట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రజల్లో కుటుంబ, ఆర్థిక, సామాజిక ఆలోచనల కారణంగా విపరీతమైన మానసిక ఒత్తిడి పెరిగి ఆందోళన ఎక్కువ కావడం, పెరుగుతున్న స్థూలకాయం, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్ల కారణంగా ఇటు పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ బీపీ బాధితుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకు దారితీస్తోంది. వీరికి ఆయా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో గ్రామాల్లోకి వచ్చే 104 వాహనాల వద్ద హైబీపీకి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు అటెన్‌లాల్, ఆమ్లోడిపిన్, టెల్మిసార్టన్, నిపిడిపిన్, సిల్నిడిపిన్, మెటో‌ప్రొలాల్, లొసార్టాన్ వంటి మందులు ఇస్తున్నారు.

అధిక రక్తపోటు అంటే..

గుండెకు రక్తాన్ని పంపింగ్ చేయడం, గుండె కొట్టుకునే స్థితినే బ్లడ్ ప్రెషర్‌గా పేర్కొంటారు. ఒక వ్యక్తి గుండె సాధారణ స్థితిలో బ్లడ్‌ప్రెషర్(బీపీ) 120/80గా పేర్కొంటారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పెద్ద వయస్సులో వారికి కొన్ని పరిస్థితుల్లో 149/90గా ఉన్నా సాధారణ స్థితిగానే నిర్ధారిస్తున్నారు. బీపీ అసాధారణ రీతిలో 160/100, 170/110, 200/120గా ఉంటే ఆరోగ్య సమస్య ఉత్పన్నమవుతుంది. ఇలాంటి పరిస్థితిల్లో కొన్నిసార్లు గుండె, మెదడులో రక్తనాళాలు దెబ్బతినడం, చిట్లడం జరిగి స్ట్రోక్‌తో పక్షవాతానికి గురై ఆసుపత్రి పాలు కావాల్సి వస్తుంది. కొన్నిసార్లు మెదడులో రక్తం చిట్లి చికిత్సకు లొంగక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది.



బీపీని కొలిచే చిత్రం

బీపీకి కారణాలు, లక్షణాలు

అధికంగా మద్యం, పొగ తాగడం, ఉప్పు అధికంగా తినడం, తక్కువ శారీరక శ్రమ వంటి చెడు అలవాట్ల వల్ల హైబీపీ వస్తుంది. దీంతో పాటు మానసిక ఒత్తిడి, తగినంత నిద్రలేకపోవడం రక్తపోటుకు కారణాలు. చెడు అలవాట్లు మానుకుని, మంచి అలవాట్లను అలవరచుకోవాలి. తీవ్రమైన తలనొప్పి, మెడనరాలు లాగేసినట్లు ఉండటం, ఆకస్మికంగా తూలిపోవడం, ఒళ్లంతా చెమటలు పట్టడం, మూత్రం తక్కువగా రావడం, కాళ్లు తిమ్మిర్లు, మూర్ఛపోవడం, శరీరంలో స్పందన లేకపోవడం వంటివి అధిక రక్తపోటు లక్షణాలు.

రక్తపోటు నియంత్రణ ఇలా..

ప్రతి ఒక్కరూ రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్(నడక) చేస్తే రక్తపోటును 5 నుంచి 8 పాయింట్ల వరకు తగ్గించుకోవచ్చు. అయితే నడక నిరంతరం చేయాలి. లేకపోతే రక్తపోటు మళ్లీ పెరగవచ్చు. వీటితో పాటు జాగింగ్, సైక్లింగ్, డ్యాన్స్ కూడా రక్తపోటును తగ్గిస్తాయి. యోగా, ప్రాణాయామాలు మేలు చేస్తాయి. అయితే ఈ వ్యాయామాలు వారి వయస్సు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యుల సలహా మేరకు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆహారంలో ఉప్పును తగ్గించుకోవడం, ధూమ, మద్యపానాలు మానేయడం, మితాహారం తీసుకోవడం, బరువు తగ్గడం వంటివి.

అధిక రక్తపోటుతో కిడ్నీ ఫెయిల్



కిడ్నీ వ్యాధులు వచ్చాయంటే మొదటి కారణం షుగర్, రెండో కారణం అధిక రక్తపోటు. 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సులో బీపీ వచ్చిందంటే మరింత అప్రమత్తంగా ఉండాలి. కిడ్నీ దెబ్బతినడం వల్లే ఆ వయస్సులో బీపీ వస్తుంది. ఇలాంటి వారిలో మూత్రంలో ప్రొటీన్, ఆర్‌బీసీ, రక్తకణాలు పోతుంటాయి. వైద్యపరీక్షలో వీటిని గుర్తించి చికిత్స తీసుకోవాలి. సమాజంలో 50 శాతం షుగర్ వల్ల, మరో 50 శాతం బీపీ వల్లే కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయి. బీపీని అదుపులో ఉంచుకునేందుకు వైద్యులు సూచించిన మందులు వాడుతూ ఉండాలి.

– డాక్టర్ వెంకటపక్కిరెడ్డి, నెఫ్రాలజిస్టు,జీజీహెచ్, కర్నూలు

గుండెపోటుకు కారణం బీపీనే



గుండెపోటు, స్ట్రోక్ వంటి వాటికి రక్తపోటు ప్రధాన కారణం. బీపీ తీవ్రస్థాయికి చేరినప్పుడు విపరీతమైన తలనొప్పి, నిద్రలేమి, చూపు మసకబారడం, విపరీతమైన అలసట, చెవుల్లో రింగుమని శబ్దాలు రావడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, గుండెదడ, తికమక పడటం లక్షణాలు కనిపిస్తాయి. గుండెకు రక్తం అందించే దమనులు కుచించుకుపోతాయి. మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి పక్షవాతం రావచ్చు. కళ్లు దెబ్బతింటాయి. మూత్రపిండాలు, గుండెపనితీరు మందగించి ప్రాణాలకు ముప్పు రావచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, మంచి అలవాట్లతో బీపీని నియంత్రవచ్చు.

–డాక్టర్ నాగేంద్రప్రసాద్ తోట, కార్డియాలజిస్టు, కర్నూలు

అందరికీ పనులు కల్పిస్తాం



పెద్దటేకూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కల్లూరు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. గురువారం కల్లూరు మండలంలోని పెద్దటేకూరు తడకనపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. గ్రామాల్లోని ఉపాధి హామీ పథకం వేతనదారులు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఈసీ మధుసూదన్‌రావు, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



కోడుమూరులో డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్ : దోమల నుంచి వచ్చే డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీమంత్‌మాదన్న సూచించారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడుమూరులో వైద్య సిబ్బంది స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గోడపత్రికలను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏడీస్ ఈజిప్ట్ దోమ పగటి పూట కుట్టడం ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, తీవ్రమైన జ్వరం, తలనొప్పి దద్దుర్లు, వాంతులు వంటి లక్షణాలుంటే ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో నీళ్లు నిల్వలేకుండా చూడాలని, దోమతెరలు వాడడంతో పాటు, కిటికీలకు, తలుపులకు నెట్లు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ అజయ్‌భాస్కర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు, కమాల్‌సాహెబ్, ఉమాభాయి, శానిటర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యమవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రోజా–2 అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ డెంగీ నివారణ, నియంత్రణ కార్యక్రమాలను వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నామని తెలిపారు. ఈ మేరకు ఆయన డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ పద్ధతులు, చికిత్స విధానాల గురించి వివరించారు. ఎవరికైనా డెంగీ లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, పెడియాట్రిక్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డెమో ప్రమీలా దేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, ఏఎంఓ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఫాతిమా, డాక్టర్ వెంకటప్రవీణ్, డాక్టర్ ముసాహిద్ చౌదరి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మూడేళ్ల బాలుడికి అరుదైన గుండె సమస్య

- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేసిన వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన మూడేళ్ల బాలుడికి అరుదైన గుండె సమస్య రావడంతో స్థానిక శ్రీచక్ర హాస్పిటల్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. వివరాలను గురువారం హాస్పిటల్ ఎండీ డాక్టర్ విజయ్‌కుమార్, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ ఎ.గౌతమ్ విలేకరులకు వివరించారు. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన సమీర్‌బాషా(3)కు కొద్దిదూరం నడిస్తే ఆయాసం, వయస్సుకు తగ్గ బరువు పెరగకపోవడం, ఉన్నట్లుండి జ్వరం రావడం, శరీరం నీలం రంగులోకి మారడం జరుగుతూ ఉండేది. తల్లిదండ్రులు పలు చోట్ల వైద్యులను కలిసి చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు శ్రీచక్ర హాస్పిటల్‌కు రాగా డాక్టర్ గౌతమ్ బాలుడికి వైద్య పరీక్షలు చేయించి టెట్రాలజీ ఆఫ్ ఫాలో అనే అరుదైన గుండె సమస్యతో పాటు మరో నాలుగైదు సమస్యలు గుండెలో ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈనెల 11న ఆపరేషన్ చేయగా 12 గంటల్లోనే బాలుడు కోలుకున్నాడు. ఆరోగ్యం కుదుటపడటంతో గురువారం డిశ్చార్జ్ చేశారు. గుండెలో అనేక ఆరోగ్య సమస్యలతో ఉన్న ఇలాంటి వ్యక్తికి హైదరాబాద్ లాంటి నగరాల్లో మాత్రమే ఆపరేషన్ చేస్తారని, తాము ఎంతో రిస్క్ తీసుకుని ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రతి 3వేల మందిలో ఒకరికి ఇలాంటి జన్యుపరమైన గుండె జబ్బులు వస్తాయన్నారు. సమావేశంలో అనెస్తెటిస్ట్ డాక్టర్ భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గర్భస్రావం

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన రాంపురం లక్ష్మీ అనే నిండు చూలాలికి బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో గర్భస్రావమైంది. కోసిగి వైద్యాధికారులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మి 9 నెలల నిండు గర్భిణి. ఆమె ప్రతి నెలా కోసిగి హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకునేదన్నారు. ప్రసవం నిమిత్తం పుట్టినిల్లు భూంపల్లి గ్రామానికి వెళ్లింది. ఆమెకు స్కానింగ్ పరీక్షలు చేయించేందుకు భర్త నాగరాజుతో కలిసి బైక్‌పై కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు వెళ్లారు. స్కానింగ్ పరీక్షలు చేసిన వైద్యులు తల్లీ, కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. అనంతరం తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో బైక్ అదుపుతప్పి కిందకు పడిపోయారు. లక్ష్మి తలకు గాయమై అపస్మారక స్థితిలో పడిపోయింది. వెంటనే ఆమెను రాయచూరు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు పురిటిలోనే బిడ్డ మృతి చెందినట్లు గుర్తించారు. సిజేరియన్ చేసి మృతి చెందిన బిడ్డను బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మి కాసేపటికి తేరుకోవడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి గర్భంలోనే శిశువు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

వైభవంగా సాయినాథుడి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి మహారథోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. గ్రామ పురవీధుల గుండా రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు సాయినాథుడిని దర్శించుకుని కిప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పురవీధుల గుండా ఎంతో రథోత్సవాన్ని ఎంతో కన్నులపండువగా నిర్వహించారు. కోడుమూరు ఎస్ఐ బాల నరసింహులు బందోబస్తు నిర్వహించారు.



పులకుర్తిలో సాయినాథుడి రథోత్సవం

గడివేములలో మోస్తరు వర్షం

గడివేముల: గత కొన్ని రోజుల నుంచి అధిక ఎండలు కాస్తుండగా ఒక్కసారిగా వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. గురువారం గడివేములతో పాటు మంచాలకట్ట, గని, బిలకలగూడూరు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు పోలాలను సిద్ధం చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు.

పది 'సప్లిమెంటరీ' హాల్ టికెట్ల విడుదల

తుగ్గలి : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో విడుదల చేసిందని ఎంఈఓ–2 రామ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా bse.ap.gov.in నుంచి హాల్ టికెట్లు పొందవచ్చన్నారు. ఇదే వెబ్‌సైట్ ద్వారా స్ట్రీమ్, జిల్లా, పాఠశాల, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని నమోదు చేసి నేరుగా హాల్ టికెట్లు పొందవచ్చని చెప్పారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ. 10వేలు అందజేస్తామని చెప్పారు. పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9398141138, 8978509384, 9703516043 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండలంలోని చిర్తనకల్లు గ్రామానికి చెందిన హనుమంతు రెడ్డి గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ కలహాల కారణంగా రెండు రోజుల క్రితం భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హనుమంతు రెడ్డి మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి మనోజ్‌కుమార్ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేశారు. ప్రస్తుతం హనుమంతు రెడ్డి కోలుకుంటున్నట్లు తెలిసింది.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- ట్రైనీ కలెక్టర్‌తో కలిసి కమిషనర్ పనుల పరిశీలన



అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీస్తున్న కమిషనర్. చిత్రంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

కర్నూలు (టౌన్): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి నగరపాలక కమిషనర్ నగరంలో వివిధ కూడళ్లు, పార్కుల ఆధునీకరణ పనులు, జంక్షన్ల అభివృద్ధి వంటి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కొండారెడ్డి బురుజు వద్ద చేపడుతున్న కూడలి అధునీకరణ పనులు, పరిమళ నగర్ పార్కులో జరుగుతున్న సుందరీకరణ పనులు, వెంకట రమణ కాలనీలో ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇంకా మిగిలి ఉన్న చిన్న పాటి పనులు, కిడ్స్ వరల్డ్ వద్ద జంక్షన్ల అభివృద్ధి, మునగాల పాడు వద్ద వై జంక్షన్ అభివృద్ధి, డివైడర్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెద్ద ఎత్తున్న చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా ఇంజినీరింగ్ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు షాకీర్ హుస్సేన్, శేషసాయి, డీఈఈలు క్రిష్ణలత, రవిప్రకాష్‌నాయుడు, గిరిరాజు, రాజశేఖర్, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, ఏఈలు దినేష్, జనార్ధన్ రాచయ్య పాల్గొన్నారు.

అనుమతులున్న విత్తనాలనే విక్రయించాలి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. విత్తనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకపోతే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం పట్టణంలోని సాయి ఆగ్రో ఏజెన్సీస్, శ్రీవెంకటేశ్వర సీడ్స్ దుకాణాల్లో ఏఓ ప్రసాదరావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బుక్‌బిల్స్ తనిఖీ చేసి విత్తన నాణ్యతను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల నుంచి పది విత్తన నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా హెచ్‌టీ టెస్టులో నెగిటివ్‌గా నిర్ధారణ వచ్చిందన్నారు. విత్తనాలను విక్రయించే డీలర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అయిజ పట్టణ వాస్తవ్యులైన విజయ్‌కుమార్, శిరీష దంపతులు రూ.46,600లను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



పొలంలో ఎరువు చల్లుతున్న రైతులు

పొలం పనుల్లో రైతన్నలు

కల్లూరు: మండలంలోని రైతులు పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో నైరుతి పవనాలు వస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేయడంతో రైతులు తమ పొలాల్లో భూసారం పెరిగి, అధిక దిగుబడుల సాధించేందుకు ముందుగా పశువుల ఎరువును చల్లుతున్నారు. ఒక వైపు పశువుల ఎరువును చల్లుతూ మరోవైపు ఎద్దులతో దుక్కిదున్నుతున్నారు. మండలంలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురవడంతో పొలాలు పదునయ్యాయి. గతేడి కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు విస్తర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.